సాక్షి ఖమ్మం
సోమవారం । 18 । సెప్టెంబర్ । 2023



'గుణ'నాథుడు

ఆదిదేవుడైన గణనాథుడి పూజకు వేళయింది. నేడు వినాయక చవితి సందర్భంగా గణపతి పూజా విశేషాలు, ప్రత్యేకతలపై కథనం. 8లో



బాల్‌బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక

రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక పోటీలు బోనకల్‌లో నిర్వహించారు. 8లో

గరిష్టం / కనిష్టం
35° / 26°

వాతావరణం

జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశముంది. ఉదయం నుంచే ఎండ ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం సహకారనగర్: కాకతీయ యూనివర్సిటీ పరిధి ఎస్డీఎల్‌సీఈలో బీఏ, బీకాం, ఎంఏ, ఎంకాం తదితర కోర్సుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈమేరకు ఖమ్మంలోని యూనివర్సిటీ పీజీ కళాశాల అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ టి.గోపి ఒక ప్రకటనలో వివరాలు వెల్లడించారు. ఇంటర్, తత్సమాన పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారు డిగ్రీలో ప్రవేశం పొందొచ్చని తెలిపారు. అలాగే, డిగ్రీ పూర్తిచేసిన వారు ఎంఏ, ఎంకాం తదితర కోర్సుల్లో ప్రవేశాలకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 25 వ తేదీలోగా స్థానిక అధ్యయన కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 99085 70890, 98492 50633 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నేటి గిరిజన దర్బార్ రద్దు

భద్రాచలం: వినాయక చవితి సందర్భంగా సోమవారం సెలవు ప్రకటించిన నేపథ్యాన భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో ప్రతీ వారం నిర్వహించే గిరిజన దర్బార్‌ను రద్దు చేశారు. ఈ విషయాన్ని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈమేరకు ప్రజలు గమనించాలని కోరారు.

మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించండి

ఖమ్మంమయూరిసెంటర్: పర్యావరణానికి ముప్పు ఎదురుకాకుండా వినాయక చవితి సందర్భంగా మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించాలని ఎంపీ నామ నాగేశ్వరరావు కోరారు. వినాయకచవితి సందర్భంగా జిల్లా ప్రజలకు ఆయన ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు అందరూ మట్టి ప్రతిమలనే పూజించి పర్యావరణ పరిరక్షణలో పాలుపంచుకోవాలని సూచించారు.

జూనియర్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

ఖమ్మంస్పోర్ట్స్: జిల్లాస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఖేలో ఇండియా ఎంపిక పోటీలను ఆదివారం నిర్వహించారు. అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ పోటీలకు జిల్లా వ్యాప్తంగా 50 మందికి పైగా క్రీడాకారులు హాజరయ్యారు. అథ్లెటిక్స్ అకాడమీ చీఫ్ కోచ్ ఎం.డీ.పర్యవేక్షించగా, ఖమ్మం టూటౌన్ సీఐ కుమారస్వామి ప్రారంభించారు. ఇక్కడ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను వరంగల్‌లో జరిగే రాష్ట్రస్థాయి ఖేలో ఇండియా పోటీలకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మందుల వెంకటేశ్వర్లు, ఎం.డీ.షఫీక్‌తోపాటు అహ్మద్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం, శారీరక దారుఢ్యం

ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

సత్తుపల్లి: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలని తద్వారా.. మానసికోల్లాసం, శారీరక ధారుఢ్యం సొంతమవుతుందని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తెలిపారు. సత్తుపల్లి మండలం సదాశివునిపేటలో జరుగుతున్న మండల స్థాయి పాఠశాలల క్రీడాపోటీలకు ఆదివారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక దృష్టితో పల్లెపల్లెనా క్రీడాప్రాంగణాలను అందుబాటులోకి తీసుకొచ్చిందని తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ, మున్సిపల్, ఆత్మ కమిటీల చైర్మన్లు కొత్తూరు ఉమామహేశ్వరరావు, కూసంపూడి మహేష్, వనమా వాసు, జెడ్పీటీసీ కూసంపూడి రామారావు, సర్పంచ్‌లు తుంబూరు సరస్వతి, దామోదర్‌రెడ్డి, హెచ్‌ఎం అజయ్‌కుమార్‌తో పాటు దొడ్డా శంకర్‌రావు, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, మందపాటి సూర్యప్రకాష్‌రెడ్డి, కె.వెంకటేశ్వరరావు, ఆళ్ల సతీష్, వి.వెంకట్రామయ్య పాల్గొన్నారు.

రామయ్యకు సువర్ణపుష్పార్చన

భద్రాచలం: భద్రాచలంలో శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానంలో మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన పూజలు చేశారు. అనంతరం స్వామి వారిని పల్లకీసేవగా చిత్రకూట మండపానికి తీసుకొచ్చారు. అక్కడ అర్చకులు స్వామి వార్లకు విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించాక నిత్యకల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించగా వందలాదిగా భక్తులు పాల్గొన్నారు.

అనతికాలంలోనే అంతులేని అభివృద్ధి



జాతీయజెండా ఎగురవేసి వందనం చేస్తున్న మంత్రి పువ్వాడ అజయ్, పక్కన సీపీ వారియర్, అదనపు కలెక్టర్ సత్యప్రసాద్



గౌరవ వందనం సమర్పిస్తున్న పోలీసులు

తెలంగాణ ఏర్పడ్డాక అన్నిరంగాల్లో ముందంజ

- జాతీయ సమైక్యతా దినోత్సవంలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్
- కలెక్టరేట్‌లో జాతీయ పతాకావిష్కరణ

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ రాష్ట్రం అవతరించిన అతి తక్కువ సమయంలోనే మునుపెన్నడూ లేని విధంగా అభివృద్ధి జరిగిందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. ఉద్యమకారుడైన కేసీఆర్ ముఖ్యమంత్రి కావడంతో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమైందని వెల్లడించారు. తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవం సందర్భంగా ఆదివారం కలెక్టరేట్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మంత్రి పువ్వాడ మాట్లాడుతూ జాతీయ సమైక్యత అంటే వివిధ వర్గాలు ప్రజలు, వివిధ సంస్కృతుల సమ్మేళనమని తెలిపారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిలో ప్రజల ఐక్యంగా భాగస్వామ్యం కావాలని కోరారు. ఇదే సమయాన అన్నివర్గాల వారికి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

సజీవంగా పోరాట గుర్తులు

ప్రజల విముక్తి కోసం మహనీయులు చేసిన పోరాటాల గుర్తులు నేటికీ సజీవంగా ఉన్నాయని మంత్రి పువ్వాడ అజయ్ వెల్లడించారు. నాటి పోరాటానికి ప్రాతినిధ్యం వహించిన మహనీయులను స్మరించుకోవాల్సిన అవసరముందని తెలిపారు. ఇక ఉద్యమాలతో సాధించుకున్న తెలంగాణ నేడు దేశానికి ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. పేద ప్రజలకు విద్య, వైద్యం అందుబాటులోకి రాగా.. తెలంగాణ బాటలోనే అన్ని రాష్ట్రాలు అడుగులు వేస్తున్నాయని చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యాన అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారిస్తూ ప్రజల మధ్య ఐక్యతను కాపాడుకుంటున్నట్లు తెలిపారు. తొలుత మంత్రి పోలీసుల గౌరవం వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ, సుడా చైర్మన్లు కూరాకుల నాగభూషణం, విజయ్‌కుమార్, అదనపు కలెక్టర్లు సత్యప్రసాద్, మధుసూదన్ నాయక్, పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభితోపాటు ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



జాతీయ సమైక్యతా వేడుకలకు హాజరైన వివిధ శాఖల అధికారులు

చరిత్రను వక్రీకరిస్తున్న బీజేపీ

- ముమ్మాటికీ సెప్టెంబర్ 17 విద్రోహదినమే..
- ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు



మాట్లాడుతున్న పోటు రంగారావు

ఖమ్మంవన్‌టౌన్: వెట్టిచాకిరీ, దోపిడీ లేని గ్రామ స్వరాజ్యాన్ని ధ్వంసం చేసిన రోజు సెప్టెంబర్ 17 అని.. ఇది ముమ్మాటికీ తెలంగాణ విద్రోహదినమేనని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.. కమ్యూనిస్టుల గెరిల్లా పోరాటం ఉన్నతదశకు చేరిన సందర్భంగా, తెలంగాణ ఫ్యూడల్, నిజాం రజాకార్ల ఓటమి దిశగా పయనిస్తుండటంతో నిజాం రాజు.. నెహ్రూ, పటేల్ సైన్యంతో రాజీ చేసుకుని తెలంగాణపై మిలటరీ యాక్షన్‌కు దిగారని తెలిపారు. దీంతో సుమారు 3 వేల మంది గెరిల్లా పోరాటయోధులు, కష్టజీవులను పొట్టన పెట్టుకున్నారని విమర్శించారు. అయితే, సెప్టెంబర్ 17ను మతదృష్టితో చూస్తున్న బీజేపీ చరిత్రను వక్రీకరిస్తుండగా, బీజేపీతో పాటు ఎంఐఎం నేతలను సంతృప్తిపరిచేలా సీఎం కేసీఆర్ వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కాగా, మహాత్మా జ్యోతిబాపూలే స్థాపించిన సత్యశోధన సమాజ్ ఆవిర్భావ కార్యక్రమాల్లో భాగంగా ఈనెల 24 నుంచి 30 వరకు కుల నిర్మూలన చైతన్యాన్ని పెంపొందించేలా గ్రామగ్రామాన సమావేశాలు జరపాలని రంగారావు పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు గుర్రం అచ్చయ్య, ఆవుల వెంకటేశ్వర్లు, జి.రామయ్య, సీవై పుల్లయ్య, కె.అర్జున్‌రావు, ఆవుల అశోక్, టి.ఝాన్సీలక్ష్మి, మంగతాయి, కంకణాల శ్రీనివాస్, ఆజాద్, లక్ష్మి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

సమాజ చైతన్యం కోసం దోహదపడాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ

ఖమ్మం సహకారనగర్: ఏడు దశాబ్దాలుగా పాలకవర్గాలు విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తుండడంతో బలహీనవర్గాలకు విద్య అందని ద్రాక్షగానే మిగిలిందని ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ అన్నారు. ఈమేరకు సమాజాన్ని చైతన్యం చేయడంతో పాటు అందరికీ సమానమైన విద్య అందేలా తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) రాష్ట్ర వైద్యా వైజ్ఞానిక మహాసభలు దోహదపడాలని తెలిపారు. అక్టోబర్‌లో ఖమ్మంలో జరగనున్న రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక మహాసభల సన్నాహాక సమావేశం ఆదివారం జెడ్పీ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సమావేశంలో ఆహ్వాన సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నాణ్యమైన విద్య అందించడం ద్వారానే బడుగు, బలహీనవర్గాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఈ దిశగా సభల్లో కార్యాచరణ రూపొందించాలని సూచించారు. టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.అశోక్‌కుమార్, పి.నాగిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించడమే కాక బోధన, బోధనేతర సిబ్బంది పోస్టులు భర్తీ చేయాలని, అన్నిరకాల బిల్లులు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. టీపీటీఎఫ్‌జిల్లా అధ్యక్షుడు వి.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి వి.మనోహర్‌రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.విజయ్‌తో పాటు బాబురావు, పూర్ణచందర్‌రావు, నాగమణి, వీరబాబు, వెంకటేశ్వర్లు, మల్లయ్య, ఏ.వీ.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటిన సింగరేణి డైరెక్టర్లు, అధికారులు

సత్తుపల్లిరూరల్: విరివిగా మొక్కలు నాటి సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు మానవ మనుగడ సాధ్యమవుతుందని సింగరేణి డైరెక్టర్లు ఎన్‌వీకే.శ్రీనివాస్, జి.వెంకటేశ్వర్‌రెడ్డి వెల్లడించారు. సత్తుపల్లి మండలం కిష్టారం ఓసీలో ఆదివారం హరితహారంలో భాగంగా ఉద్యోగులతో కలిసి డైరెక్టర్లు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ హరితహారంలో సింగరేణి మొదటి స్థానంలో ఉందని తెలిపారు. ఓసీల చెంతన భారీసంఖ్యలో మొక్కలు నాటడం వల్ల పరిసర గ్రామాలకు స్వచ్ఛమైన గాలి అందుతుందని, వాతావరణ సమతుల్యత సాధ్యమవుతుందని చెప్పారు. ఆతర్వాత డైరెక్టర్లు కిష్టారం, జేవీఆర్ ఓసీల్లో బొగ్గు ఉత్పత్తి, రవాణాను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలేంరాజు, వివిధ విభాగాల అధికారులు జీ.వీ.కోటిరెడ్డి, దుర్గాప్రసాద్, ఎస్.వెంకటాచారి, నర్సింహారావు, డి.రమణారెడ్డి, టి.సత్యనారాయణ, హరినారాయణ, విక్రంబాబు, మదీనా బాషాతో పాటు టీబీజీకేఎస్ నాయకుడు ఎం.డీ.రజాక్ తదితరులు పాల్గొన్నారు.

బహుజనుల రాజ్యం వస్తేనే అభివృద్ధి

- రాష్ట్రాన్ని ఇప్పుడు ఏలుతున్నది దొరలే...
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్



సభలో అభివాదం చేస్తున్న ప్రవీణ్‌కుమార్, నాయకులు

కూసుమంచి: రాష్ట్రంలో దొరల రాజ్యం నడుస్తుండగా, ఇది పోయి బహుజనుల రాజ్యం సిద్ధించడం ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుందన్న లక్ష్యంతో బీఎస్పీ పోరాడుతోందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ వెల్లడించారు. కూసుమంచిలో ఆదివారం జరిగిన బీఎస్పీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బహుజనుల లక్ష్యం రాజ్యాధికారమేనని, ఇందుకోసం అందరూ పోరాడాలని పిలుపునిచ్చారు. బహుజనులను అణగదొక్కుతూ సాగుతున్న దొరల పాలనకు చరమగీతం పాడే రోజులు సమీపంలో ఉన్నాయని తెలిపారు. కాగా, రాష్ట్రంలో సీఎం కేసీఆర్ కనుసన్నల్లోనే అక్రమ మైనింగ్ వ్యవహారం నడుస్తుండగా, రూ.వేల కోట్ల ప్రజాధనం కొల్లగొడుతున్నారని ఆరపించారు. జిల్లా ప్రజాప్రతినిధులు అలాగే వ్యవహరిస్తున్నారని తెలిపారు. తెలంగాణలో కల్వకుంట్ల కుటుంబం అక్రమంగా సంపాదించిన సొమ్ముతో లిక్కర్ వ్యాపారంలో పెట్టుబడులు పెట్టడమేకాక కారుచౌకగా భూములను విక్రయించి సొమ్ము దండుకున్నారని ఆరోపించారు. లిక్కర్ స్కాంలో ఎమ్మెల్సీ కవితను కాపాడేందుకే సీఎం కేసీఆర్ మోడీ వద్ద మోకరిల్లాడని ధ్వజమెత్తారు. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు విఫలం కాగా.. బీఎస్పీ పోరాడుతోందని ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కాగా, పాలేరు నుంచి వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థిగా బరిలోకి దిగే అల్లిక వెంకటేశ్వరరావును అన్ని వర్గాల ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. ప్రవీణ్‌కుమార్ పర్యటన సందర్భంగా తొలుత నాయకన్‌గూడెం టోల్‌ప్లాజా నుండి కూసుమంచి వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ పాలేరు ఇన్‌చార్జి అల్లిక వెంకటేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్ర కామేష్‌తో పాటు నాయకులు మంద ప్రభాకర్, గొల్ల సతీష్, నాయకులు సాంబశివగౌడ్, బుర్రా ఉపేందర్ సాహూ, పుల్లయ్య, పీసీ వీరస్వామి, ఉపేందర్, మంజుల, రజిని తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ హితమే పరమావధి

- మట్టి విగ్రహాలతోనే కాలుష్యానికి చెక్
- ప్రజలందరూ అవగాహన పెంపొందించుకోవాలి
- 'సాక్షి', స్తంభాద్రి ఉత్సవ సమితి ఆధ్వర్యాన మట్టి గణపతి విగ్రహాల పంపిణీ



మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న స్తంభాద్రి ఉత్సవ సమితి బాధ్యులు



భక్తులకు విగ్రహాలు అందజేస్తున్న సాక్షి బృందం

ఖమ్మంగాంధీచౌక్: అందరూ ఇష్టంగా భక్తిభావంతో జరుపుకునే వినాయక చవితి సందర్భంగా పర్యావరణ హితమై పరమావధిగా కృషి చేయాలని పలువురు వక్తలు సూచించారు. వినాయక చవితి సందర్భంగా సాక్షి మీడియా గ్రూప్, స్తంభాద్రి ఉత్సవ సమితి సంయుక్త ఆధ్వర్యాన ఆదివారం ఖమ్మంలోని పెవిలియన్ మైదానం వద్ద మట్టితో చేసిన గణపతి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఖమ్మం నగరంతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన వారు విగ్రహాలను స్వీకరించారు.

అందరికీ ప్రీతిపాత్రమే...

విగ్రహాల పంపిణీ సందర్భంగా స్తంభాద్రి ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వినోద్ లహోటి, కీసర జయపాల్‌రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షులు గెంట్యాల విద్యాసాగర్, కన్వీనర్ ప్రసన్నకృష్ణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి అల్లిక అంజయ్య మాట్లాడారు. వినాయక ఉత్సవాలంటే చిన్నాపెద్ద అందరికీ ప్రీతిమాత్రమేనని తెలిపారు. అదే సమయాన పర్యావరణ హితంగా ఉత్సవాలను నిర్వహించుకోవాలని కోరారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన వినాయక విగ్రహాలను చెరువుల్లో నిమజ్జనం చేయడంతో నీటి కాలుష్యమే కాక పర్యావరణం దెబ్బతింటుందని, జలరాశుల మనుగడకు ముప్పు వాటిల్లుతోందని తెలిపారు. ఏటా వినాయక ఉత్సవ మండళ్లు పెరుగుతున్న నేపథ్యాన అందరూ మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించేలా స్తంభాద్రి ఉత్సవ సమితి కృషి చేస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్తంభాద్రి ఉత్సవ సమితి ఖమ్మం అర్బన్ ఇంచార్జి నూకల కృష్ణమోహన్, గారిశెట్టి శ్రీనివాస్ గుప్తా, గుత్తా వెంకటేశ్వరరావు, నార్ల రంగారావు, తిరుమల, తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా ప్రోగ్రాం కన్వీనర్ కర్నాటి రామకృష్ణారెడ్డి, డాక్టర్ ప్రవీణ్‌కుమార్, సాక్షి బ్యూరో ఇన్‌చార్జి బొల్లం శ్రీనివాస్, బ్రాంచ్ మేనేజర్ మోహన్‌కృష్ణతోపాటు సాక్షి ఉద్యోగులు పాల్గొన్నారు.



ఏటా మట్టి విగ్రహమే..



వినాయక చవితి ఉత్సవాలను ఏటా జరుపుకుంటాం. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతీసారి మట్టి విగ్రహాలనే పూజిస్తున్నాం. కాలుష్యాన్ని అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉంది. ఉచితంగా వినాయక విగ్రహాలను పంపిణీ చేయాలనే ఆలోచన బాగుంది.

– కృష్ణకుమారి, గోపాలపురం, ఖమ్మం


పీఓపీతో నీటి కాలుష్యం



ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసిన విగ్రహాలను జలాశయాల్లో నిమజ్జనం చేస్తున్నారు. తద్వారా నీరు కాలుష్యం కావడమే కాక జలాచరాల మనుగడ దెబ్బతింటోంది. సాక్షి, స్తంభాద్రి సమితి తరఫున ఉచితంగా మట్టి విగ్రహాలను పంపిణీ చేయటం అభినందనీయం.

– కె.వీరబాబు, బురహాన్‌పురం, ఖమ్మం

పర్యావరణ పరిరక్షణ కోసమే...



పర్యావరణాన్ని పరిరక్షించాలనే లక్ష్యంతో మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాం. గణపతి పూజకు ప్రాధాన్యం ఇస్తూనే పర్యావరణాన్ని రక్షించడాన్ని అందరూ బాధ్యతగా భావించాలి. మా తరఫున పదేళ్ల నుంచి మట్టి విగ్రహాలను ప్రోత్సహిస్తున్నాం.

– వినోద్ లహోటి, అధ్యక్షుడు, స్తంభాద్రి ఉత్సవ సమితి

జలరాశులను పరిరక్షించాలి..



ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన విగ్రహాలతో అనర్థాలను గుర్తించి జలరాశుల పరిరక్షణకు అంతా నడుం బిగించాలి. నవ ధాన్యాలు కలిపి తయారుచేసిన మట్టి విగ్రహాలను పూజించి జలాశయాల్లో నిమజ్జనం చేస్తే జలరాశులకు ప్రయోజనం ఉంటుంది.

– అల్లిక అంజయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ, స్తంభాద్రి ఉత్సవ సమితి

క్లుప్తంగా

ఇల్లెందు డిపో నుంచి సర్వీసులు ప్రారంభం



బస్ సర్వీస్‌ను ప్రారంభిస్తున్న డీఎం తదితరులు

ఖమ్మంమామిళ్లగూడెం: ఇటీవల ప్రారంభించిన ఇల్లెందులోని ఆర్టీసీ శాటిలైట్ డిపో నుంచి సర్వీసులు మొదలయ్యాయి. ఈ మేరకు డిపోకు చెందిన 14 బస్ సర్వీసులను కొత్తగూడెం డీఎం బి.వెంకటేశ్వర్లు ఆదివారం ప్రారంభించారు. అలాగే, డిపోకు కేటాయించిన 55 మంది ఉద్యోగులు ఆదివారం వారి డిపోల నుంచి రిలీవ్ అయ్యారు. తొలిరోజు ఇల్లెందు డిపో నుంచి ఖమ్మం, కొత్తగూడెం, గుండాల, బయ్యారం, మియాపూర్ తదితర ప్రాంతాలకు సర్వీసులు నడిచాయని డీఎం తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

మధిర: ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏపీలోని గుంటూరు జిల్లా రేపల్లె ప్రాంతానికి చెందిన సూర్యనారాయణ(40) భార్య, ఇద్దరు కుమారులతో మూడేళ్లుగా మధిరలో నివసిస్తున్నాడు. ఆయన నివాసముండే అపార్ట్‌మెంట్ ఎదుట హోటల్ నిర్వహిస్తుండగా, శనివారం సాయంత్రం భార్యాపిల్లలు స్వస్థలానికి వెళ్లారు. అయితే, ఆర్థిక ఇబ్బందులతో సతమవుతున్న సూర్యనారాయణ ఇంట్లో ఎవరూ లేని సమయాన ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో కుటుంబీకులు చేరుకోగా, ఘటనపై కేసు నమోదు చేసినట్లు మధిర టౌన్ ఎస్‌ఐ రాజేష్ తెలిపారు.

చికిత్స పొందుతున్న వివాహిత మృతి

ముదిగొండ: కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగిన వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందింది. మండలంలోని మల్లన్నపాలెంకు చెందిన వాణి(26)కి ఎనిమిదేళ్ల క్రితం అమరబోయిన నాగరాజుతో వివాహమైంది. కుటుంబంలో ఏర్పడిన కలహాలతో ఆమె నాలుగు రోజుల క్రితం గడ్డి మందు సేవించింది. దీంతో వాణిని కుటుంబీకులు ఖమ్మం ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందింది. ఆమె తండ్రి ఆదివారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

పిచ్చికుక్క దాడిలో ఆరుగురికి గాయాలు

సత్తుపల్లిటౌన్: పిచ్చికుక్క ఒక్కసారిగా దాడి చేయటంతో ఆరుగురికి గాయాలయ్యాయి. సత్తుపల్లిలో ఆదివారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకుంది. పట్టణంలోని అయ్యగారిపేటరోడ్డుకు చెందిన టి.అప్పారావు, వి.వెంకటేష్, పాకల వెంకటేశ్వర్లు, జొన్నలగడ్డ రామకృష్ణ, ఏకాంబేశ్వరి, బొజ్జా దీపక్ తదితరులు పిచ్చికుక్క దాడిలో గాయపడగా సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం



ఇంట్లో పరిశీలిస్తున్న సిబ్బంది, నాయకులు

ఖమ్మంక్రైం: ఖమ్మం జూబ్లీపురలోని ఓ ఇంట్లో షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగింది. జూబ్లీపురలోని ఒకరి ఇంట్లో ఫ్రిజ్‌లో ఆదివారం షార్ట్ సర్క్యూట్ ఏర్పడగానే మంటలు వ్యాపించాయి. దీంతో అగ్ని మాపక శాఖ సిబ్బందికి ఫోన్ చేయగా వారు చేరుకుని మంటలను అదుపుచేశారు. ఘటనాస్థలాన్ని బీఆర్ఎస్ నాయకుడు తదితరులు కన్నం ప్రసన్నకృష్ణ పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్మీ హవల్దార్ మృతి



ఇళయరాజా (ఫైల్)

కల్లూరు: కల్లూరులో ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్మీ హవల్దార్ ఎస్.ఇళయరాజా(40) మృతి చెందాడు. తమిళనాడు రాష్ట్రం వేలూరుకు చెందిన ఆయన ఖమ్మం ఎస్‌సీసీ బెటాలియన్‌లో హవల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఖమ్మం నుంచి సత్తుపల్లి వైపు ఆదివారం తెల్లవారుజామున ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన లారీ సైడ్ హుక్కు తలకు తగలడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పెనుబల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా, మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉండగా.. ప్రస్తుతం ఆయన భార్య నిండు గర్భిణి అని తెలిసింది.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,026

'గుణ'నాథుడు

- వినాయక రూపంలోని ప్రతి అవయవమూ ఓ సందేశమే
- భక్తిశ్రద్ధలతో ఆచరిస్తే జీవితానికి అర్థం.. పరమార్థం..

నేడు వినాయకచవితి





ఇల్లెందులో విక్రయానికి సిద్ధంగా ఉన్న గణపతి ప్రతిమలు

ఇల్లెందురూరల్: పల్లెలు, పట్టణాల్లో ఏటా వినాయకచవితిని ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తుంటారు. బొజ్జగణపయ్య విగ్రహాన్ని పలు వీధుల్లో ప్రతిష్ఠించి నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తారు. తరువాత ఆ ఆదిదేవుడిని ఊరేగింపుగా నిమజ్జనానికి తీసుకెళతారు. అంతేకాకుండా ఆ లంబోదరుడిని చూసి మనమెంతో నేర్చుకోవచ్చు. మూషిక వాహనుడిలో కనిపించే ప్రతి అవయవమూ మనకు ఒక సందేశాన్నిస్తుంది. గణనాథుడి నుంచి స్ఫూర్తి పొందితే విజేతలుగా నిలిచేందుకు దారి కనిపిస్తుంది. కుంగుబాటుకు గురయ్యే వారికి ధైర్యం నూరిపోస్తుంది. ఎదిగినా ఒదిగి ఉండాలనే ఔన్నత్యాన్ని చాటిచెబుతుంది. ఆత్మవిశ్వాసాన్ని పెంచుకునేందుకు ఔషధంలా పనిచేస్తుంది. ఈ 'గుణ'నాథుడి స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ సన్మార్గంలో పయనించి అర్థవంతమైన జీవితాన్ని ఆచరించడమే వినాయకచవితి మనకు అందిస్తున్న గొప్ప సందేశం.

ఏకాగ్రత, సునిశిత పరిశీలన..

మనం ఏదైనా దృశ్యాన్ని చక్కగా చూడాలంటే కళ్లు దగ్గరగా చేసుకొని చిన్నవిగా చేసి చూస్తాం. అంటే అదే వస్తువు లేదా ప్రదేశంపై మనసు లగ్నం చేసుకొని ఏకాగ్రతతో పరిశీలిస్తాం. మరి వినాయకుని కళ్లు కూడా చింతకాయలా చిన్నవిగా ఉంటాయి. ఏకాగ్రత, సునిశితమైన పరిశీలనకు ఆయన కళ్లు మనకు ఆదర్శం. ఆయన కళ్లు విషయాలను నిశితంగా గమనించాలని, సూక్ష్మ గ్రాహకాలు కావాలని ఇచ్చే సందేశానికి సంకేతం.

చెవులు చాటంత..

'ఎవరైనా ఏదైనా విషయం చెప్పేటప్పుడు చెవులు చాటంత చేసుకొని విను'.. అనే మాట వాడుకలో ఉంది. గణపతి దేవుని ముందు నిల్చొని పూజ చేస్తున్నప్పుడు చాటంత చెవులు మనకు కనిపిస్తాయి. ఆయన పెద్ద చెవులు మనకెప్పుడూ గుర్తుకు రావాలి. ప్రతి విషయాన్ని వీలైనంత ఎక్కువగా విని నేర్చుకోవాలనే సందేశాన్ని ఆయన చెవుల ద్వారా మనం గ్రహించాలి.

నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది..

నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుందంటారు. వినాయకుని నోటిని చూసినా మనకు ఆ విషయం స్పష్టమవుతుంది. ఆయన చిన్న నోరును చూసి మనం తెలుసుకోవాల్సింది ఎంతో ఉంది. తక్కువగా మాట్లాడాలని, అనవసరంగా నోరు పారేసుకోవద్దని ఆ చిన్న నోరు మనకు చెప్పకనే చెపుతోంది. ఇంకా ఆ చిన్న నోటిని తొండం కప్పేసి ఉంటుంది. వివేకానికి చిహ్నంగా చెప్పుకునే తొండం ప్రతి మాట వడపోతలా బయటకు రావాలని చెపుతుంది. అందుకే ఇతరులతో మాట్లాడేటప్పుడు వినయం.. విధేయత ప్రదర్శిస్తూ అనవసరమైన మాటలు వద్దని చెబుతోంది ఆయన నోరు.

జ్ఞానం.. ఆరోగ్యం..



గణనాథుడిగా పేరు ప్రఖ్యాతులుగాంచిన విఘ్నేశ్వరుడిని ప్రతి ఒక్కరూ ఇష్టంగా పూజిస్తుంటారు. ఆది దేవుడైన ఆయన ప్రతిరూపం వింతగా కనిపించినప్పటికీ ఆయనలోని ప్రతి అవయవం గొప్ప సందేశానికి ప్రతిరూపంగా నిలుస్తుంది. పండుగ నాడు ప్రసాదాలు ఘాటుగా, వికారాన్ని కలిగించేవిగా కాకుండా ఆరోగ్యకరమైనవిగా తయారు చేస్తారు. కేవలం ఆవిరి మీద ఉడకబెట్టిన వాటినే ప్రసాదంగా స్వీకరిస్తాడు వినాయకుడు. అదే సాత్వికమైన ఆహారం. ఇలా భక్తులకు ఆరోగ్యాన్ని కూడా ప్రసాదిస్తాడు లంబోదరుడు.

– జిల్లోజు రామాచార్యులు, అర్చక, పురోహితుల సంఘం జిల్లా కార్యదర్శి, భద్రాద్రి కొత్తగూడెం

జ్ఞానం పొందడంలో తృప్తి ఉండకూడదు

మనం నేర్చుకున్నది చాలులే అన్న తృప్తి చెందక మరింత జ్ఞానాన్ని సంపాదించడానికి ఏకదంతుని బొజ్జను చూసి అన్వయించుకోవాలి. చదివింది.. నేర్చుకుంది చాలదు. ఇంకా నా కడుపు నిండలేదు అన్నట్లుగా భావించాలి. ఎంత చదివినా ఇంకా చదవాలి. ఇంకా నేర్చుకోవాలనే తపన చెప్పేదే వినాయకుడి బొజ్జ.

మూషిక వాహనం..

వినాయకుని ప్రతిమలో మనకు కనిపించే విచిత్రం ఆయన ప్రయాణం చేసే వాహనం ఎలుక. అంత భారీకాయుడైన విఘ్నేశ్వరుడు చిట్టి ఎలుకపై ప్రయాణం ఎలా.. అనే ధర్మసందేహం మనకు కలుగవచ్చు. కానీ మిగతా దేవతల వాహనాలతో పోలిస్తే ఎలుక అతి సామాన్యమైన వాహనం. అనవసరమైన కోరికలను అదుపులో ఉంచుకోవడం అలవర్చుకోవడం కోసం ఆ ఎలుక వాహనం మనకు మంచి విషయం చెబుతుంది. విద్యార్థి దశ నుంచే పెద్ద వాహనాలు కొనివ్వాలని అత్యధికులు తమ తల్లిదండ్రులను ఇబ్బంది పెడుతున్నారు. వద్దన్నా వాటిని నడిపి ప్రమాదానికి గురైన ఘటనలెన్నో నిత్యం కనిపిస్తున్నాయి. అవసరం లేకున్నా సెల్‌ఫోన్ వాడకం.. జేబు ఖర్చు.. ఇలాంటి అలవాట్ల విషయంలో మనసును అదుపులోకి పెట్టుకొని లేనిపోని ఆర్భాటాలు, కోరికలకు వెళ్లొద్దని ఈ మూషిక వాహనం మనకు చెబుతోంది.

బాల్ బ్యాడ్మింటన్ ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక



ఎంపికైన కొత్తగూడెం విద్యార్థులతో పీఈటీ

బోనకల్: సబ్‌జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ ఉమ్మడి జిల్లా జట్టును ఆదివారం ఎంపిక చేశారు. బోనకల్‌లో జరిగిన ఎంపిక పోటీలకు వంద మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరిలో ప్రతిభ కనబర్చిన వారిని ఈనెల 30న నుంచి జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే జట్టుకు ఎంపిక చేసినట్లు బి.రమేష్, జె.శివకృష్ణ తెలిపారు. పీఈటీలు సంధ్యారాణి, దుర్గా, నాగమణి, త్రివేణి, జాతీయ క్రీడాకారులు సీహెచ్.శశిధర్, బి.గోపి పాల్గొన్నారు.

జట్టులో కొత్తగూడెం విద్యార్థులు

ఖమ్మంఅర్బన్: రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక చేసిన జట్టులో ఖమ్మం 14వ డివిజన్ కొత్తగూడెం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ముగ్గురికి స్థానం దక్కింది. బోనకల్‌లో జరిగిన ఎంపిక పోటీలకు హాజరైన విద్యార్థులు సైజన్య, వెన్నిక, ప్రభుకిరణ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే జట్టుకు ఎంపికయ్యారు. వీరిని హెచ్ఎం ఎం.వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ కూరాకుల వలరాజు, పీఈటీ శ్రీదేవి, ఎంఎస్‌సీ చైర్మన్ గూటి శ్రీనివాసరావు అభినందించారు.

విశ్వకర్మ జయంతి వేడుకలు



విశ్వకర్మ జయంతి వేడుకలను ప్రారంభిస్తున్న మంత్రి అజయ్, తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: కలెక్టరేట్‌లో ఆదివారం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యాన శ్రీ విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి మాట్లాడారు. రాష్ట్రంలో బీసీ సంక్షేమ శాఖ ద్వారా చేతి, కులవృత్తుల వారికి రూ.లక్ష సాయం అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే, ప్రభుత్వం అన్నివర్గాల అభ్యున్నతికి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ లింగాల కమలరాజ్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ విజయ్‌కుమార్, పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్, అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, డి.మధుసూదన్ నాయక్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, బీసీ సంక్షేమ అధికారి జ్యోతి పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు

- తల్లి ఒడిలో నిద్రిస్తున్న ఆరు నెలల చిన్నారి మృతి

కూసుమంచి: ఖమ్మం–సూర్యాపేట జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరు నెలల చిన్నారి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఏపీలోని ఏలూరు జిల్లా కోయలగూడెంకు చెందిన పొన్నాటి యువరాజు తన భార్య హేమలత, ఆరు నెలల కూతురు శివానీతో కలిసి కారులో శనివారం రాత్రి నార్కట్‌పల్లి వెళ్తున్నాడు. నార్కట్‌పల్లిలో సుతారీ మేస్త్రీగా పనిచేసే ఆయన కారు నాయకన్‌గూడెం వద్దకు రాగానే మరమ్మతుల కారణంగా రోడ్డుపై నిలిచి ఉన్న లారీని ఢీకొట్టింది. దీంతో కారు నడుపుతున్న యువరాజుకు తీవ్ర గాయాలు కాగా వెనుక సీట్‌లో కూర్చున్న హేమలతకు స్వల్ప గాయాలయ్యాయి. అయితే, ఆమె ఒడిలో ఉన్న చిన్నారికి తీవ్రగాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో ఖమ్మం ఆస్పత్రికి తరలించగా ఆదివారం తెల్లవారుజామున మృతి చెందింది. లారీ డ్రైవర్ వేణు నిర్లక్ష్యంగా రహదారిపై నిలపడంతోనే ఈ ఘటన జరిగిందనే ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

హైవేపై వరుస ప్రమాదాలతో ఆందోళన

ఖమ్మం–సూర్యాపేట జాతీయ రహదారిపై తరచుగా ప్రమాదాలు జరుగుతుండగా, పలువురు ప్రాణాలు కోల్పోతుండడానికి హైవే అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ జుజుల్‌రావుపేట గ్రామస్తులు ఆందోళనకు దిగారు. జాతీయ రహదారిపై నాయకన్‌గూడెం వద్ద శనివారం రాత్రి ఆగి ఉన్న లారీని ఓ కారు ఢీకొట్టగా ఎనిమిది నెలల పసిపాప మృతి చెందింది. అలాగే, కారు నడువుతున్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఇక శుక్రవారం కూడా ఓ కారు బోల్తా పడడంతో అందులోని వారు గాయపడ్డారు. ఇలా తరచుగా ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు నివారణ చర్యలు చేపట్టడం లేదని ఆరోపిస్తూ జుజుల్‌రావుపేట గ్రామస్తులు ఆదివారం టోల్‌గేట్ వద్ద ఆందోళనకు దిగారు. దీవతో కూసుమంచి, మోతె ఎస్సైలు రమేష్‌కుమార్, వెంకటేశ్వర్లు చేరుకుని దిద్దుబాటు చర్యలు చేపడుతామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

వేగంగా ట్రాక్టర్ నడిపిన ఇద్దరిపై కేసు

నేలకొండపల్లి: అతివేగంతో అజాగ్రత్తగా ట్రాక్టర్ నడుపుతున్న ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. నేలకొండపల్లి మండలంలోని కొత్తకొత్తూరులో పెద్దమండవకు చెందిన ఎం.గోపి, నాచేపల్లిలో పెద్దమండవకు చెందిన పటాన్ బాబా ట్రాక్టర్‌ను అతి వేగంగా నడుపుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేయటంతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బీజేపీ ఆధ్వర్యాన విమోచన దినోత్సవం



ఖమ్మంలో జాతీయ జెండా ఎగురవేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ



సుబ్లేడులో షోయాబుల్లాఖాన్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కొండపల్లి శ్రీధర్‌రెడ్డి



ఖమ్మంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న దుర్గాప్రసాద్



బీఆర్ఎస్ కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న ఉద్యమకారులు

ఖమ్మం మామిళ్లగూడెం: నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన పలువురి ప్రాణాలను బలిగొన్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ తెలిపారు. ఆ పార్టీ ఆధ్వర్యాన ఆదివారం తెలంగాణ విమోచన దినోత్సవం నిర్వహించగా, జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సత్యనారాయణ జాతీయ జెండా ఎగురవేసి మాట్లాడారు. ఆతర్వాత ప్రధాని మోదీ జన్మదినాన్ని రక్తదాన శిబిరం నిర్వహించారు. నాయకులు గెంటెల విద్యాసాగర్, పసుమర్తి సతీష్, శ్యాంరాథోడ్, సరస్వతి, ఉపేందర్, విజయరెడ్డి, అల్లిక అంజయ్య, కిరణ్, భద్రం, అరుణ, ఉపేందర్‌గౌడ్, కార్తీక్, పాపారావు, పద్మావతి, దీకొండ శ్యాం, భవాని, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. కాగా, ఖమ్మంలోని 26వ డివిజన్‌లో బీజేపీ నాయకుడు మార్తి వీరభద్రప్రసాద్ జాతీయ జెండా ఎగురవేయగా, బండారి శ్రీనివాసరావు, ఆకుల మురళి, ఖాదర్‌బాబా, పాపని నాగ, గడ్డం అశోక్, లలిత, మారుతి, శేష, ఫణికుమార్ పాల్గొన్నారు.

ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే...

తిరుమలాయపాలెం: ఓటు బ్యాంకు రాజకీయాల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ విమోచన దినోత్సవాన్ని సమైక్యతా దినోత్సవంగా నిర్వహిస్తోందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. తిరుమలాయపాలెం మండలం సుబ్లేడులో నిజాం వేధింపులకు గురై ప్రాణత్యాగం చేసిన పాత్రికేయుడు షోయాబుల్లాఖాన్ విగ్రహం వద్ద నిర్వహించిన తెలంగాణ విమోచన దినోత్సవంలో ఆయన జెండా ఎగురవేసి మాట్లాడారు. నాయకులు గుండా శ్రీనివాసరెడ్డి, బొడ్డుపల్లి ప్రసాద్, నల్లగట్టు శ్రీనివాసర్, వీరెల్లి లక్ష్మయ్య, సర్పంచ్ సంజీవయ్య, జియావుద్దీన్, మెట్టు ఆంజనేయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యాన విలీన దినోత్సవం

ఖమ్మం సహకారనగర్: జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో తెలంగాణ విలీన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడగా నాయకులు జావీద్, వడ్డెబోయిన నర్సింహరావు, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, వెంకన్న, దేవత్ దివ్యానాయక్, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యాలయంలో సమైక్యతా దినోత్సవం

ఖమ్మం వైరారోడ్: ఖమ్మంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యమకారులు ఉప్పుల వెంకటరమణ, డోకుపర్తి సుబ్బారావు జాతీయ జెండా ఎగురవేశారు. ఇం పగడాల నరేందర్, కోడిరెక్క ఉమాశంకర్, వంశీ, యలమద్ది రవి, మీగడ శ్రీనివాస్‌యాదవ్, బంక మల్లయ్య, మద్దెల విజయ్, దరిపెల్లి వీరబాబు, కొలిపాక వెంకటేశ్వరరావు, ఆసిఫ్ అహ్మద్, పాసంగులపాటి శ్రీనివాసరావు, పోగుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భారీ ర్యాలీగా విజయభేరి సభకు..



ర్యాలీలో అభివాదం చేస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: హైదరాబాద్ తుక్కుగూడలో ఆదివారం నిర్వహించిన కాంగ్రెస్ విజయభేరి సభకు ఉమ్మడి జిల్లాలోని టీపీసీసీ ప్రచార కమిటీ కోచైర్మన్, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరులు, కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ఈమేరకు వెయ్యికి పైగా కార్లలో పొంగులేటి అభిమానులు, అనుచరులు కార్లలో బయలుదేరారు. వివిధ నియోజకవర్గాల నుంచి వాహనాలు ఖమ్మం చేరుకోగా.. కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ సభ్యుడు మువ్వా విజయబాబు, క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి తదితరులు స్వాగతం పలికి ముందుకు సాగారు.



నాయకులు వెళ్తున్న వాహనాలు